నేడు బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 4: చిన్నశంకరంపేటలోని శ్రీనివాస్ గార్డెన్‌లో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని శుక్రవారం (నేడు) నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు రాజు గురువారం తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి హాజరవుతారన్నారు. మండలంలోని గ్రామాల ఎంపీటీసీలు, సింగిల్‌విండో చైర్మన్లు, మాజీ సర్పంచ్‌లు, గ్రామ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యకర్తలు విధిగా హాజరుకావాలని తెలిపారు.

నీటి ఇబ్బందులకు హెల్ప్‌లైన్ నంబర్

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 4: పట్టణంలో నీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురైతే హెల్ప్‌లైన్ నంబర్ 91542 93346కు ఫోన్ చేసి తెలుపాలని మున్సిపల్ కమిషనర్ జానకీరామ్ సాగర్ విజ్ఞప్తి చేశారు. తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా, నీటి ఎద్దడి లేకుండా నీరు అందించడంలో తక్షణ చర్యలు తీసుకోవడానికి మున్సిపల్ కార్యాలయంలో ఈ నంబర్ ఏర్పాటు చేశామన్నారు.

7న మోడల్ స్కూల్‌లో ప్రవేశ పరీక్ష

నర్సాపూర్, ఏప్రిల్ 4: మండలంలోని జక్కపల్లి గ్రామంలో ఉన్న తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఈ నెల 7వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ విజయలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పరీక్షకు 6వ తరగతికి 416, 7వ తరగతికి 172, 8వ తరగతికి 130, 9వ తరగతికి 112, 10వ తరగతికి 21 అప్లికేషన్లు వచ్చాయన్నారు. పరీక్షకు వచ్చే విద్యార్థులు హాల్ టికెట్, బ్లాక్/బ్లూ పెన్ తీసుకురావాలని సూచించారు. 6వ తరగతి పరీక్ష ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, 7, 8, 9, 10 తరగతులకు మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

7న ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశ పరీక్ష

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 4: 2024-25 విద్యా సంవత్సరానికి ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశాలకు ఈ నెల 7వ తేదీన పరీక్ష నిర్వహిస్తున్నట్లు డీఈవో రాధాకిషన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షకు సంబంధించి హాల్ టికెట్లు telanaganams.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. జిల్లాలో 9 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని, విద్యార్థులు తమకు కేటాయించిన పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరుకోవాలని తెలిపారు. 6వ తరగతి పరీక్ష ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, 7 నుంచి 10వ తరగతి వరకు పరీక్ష మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

రామాయంపేట, ఏప్రిల్ 4: పాదచారులు, ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు మెదక్ చౌరస్తా, బస్టాండ్ వద్ద జిల్లా వీహెచ్‌పీ అధ్యక్షుడు పబ్బ సత్యం ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని గురువారం ప్రారంభించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PLOT FOR SALE

★గజ్వేల్ టౌన్ మెయిన్ రోడ్, SBI దగ్గర, 161 చ॥గ॥ ఇంటి స్థలం అమ్మబడును. సంప్ర: 8143366630 / 9989554915.
NT-110

WANTED

★Wanted Agents, Associates Franchise throughout Telangana for Abroad Medical College Admission. 8881116865 / 8881115253.
NT-311882-All

LOST

★I, K RAMESH, S/o. K.Narsaiah, Flat No. 103, SBI Building, Chegunta. I Lost the Orginal Sale Deed AGPA: 3885/2023, SRO Shameerpet, Link Docs: Sale Deed 7017/2021, 7018/2021, SRO Shameerpet. While I'm travelling from Shameerpet to Shankarampet-R Medak Dist. Lost the Documents on 04/April/2024. If any body found, please Call: 6303688491.
NZB-0000

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న, లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఎన్నికల్లో పోలింగ్ అధికారుల పాత్ర కీలకం

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్
- డిగ్రీ కళాశాల పీవో, ఏపీవో శిక్షణ కేంద్రం పరిశీలన

శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 4: ఎన్నికల నిర్వహణలో పోలింగ్ అధికారులు పాత్ర కీలకమని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరాన్ని ఆయన సందర్శించారు. కొనసాగుతున్న శిక్షణా విధానాన్ని పరిశీలించారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన విధివిధానాలు, పోస్టల్ బ్యాలెట్ వినియోగం తదితర అంశాలపై దిశానిర్దేశం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలింగ్ అధికారులు ముఖ్యంగా ఈవీఎం యంత్రాలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. మాక్ పోల్ నిర్వహణ, ఈవీఎం యంత్రాల పనితీరు, బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీ పాట్ల కనెక్షన్లు వాటి పనితీరు, మరమ్మతు జరిగితే తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. జిల్లాలో పార్లమెంట్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. శిక్షణ పొందే ఎన్నికల సిబ్బందికి ఎలాంటి సందేహాలు ఉన్నా నివృత్తి చేసుకోవాలన్నారు. తొలి విడత శిక్షణ ఇప్పటికే పూర్తయిందని, ఎన్నికల నిర్వహణలో భాగంగా బ్యాలెట్, కంట్రోలింగ్ యూనిట్, వీవీ పాట్ల అమరిక తదితర అంశాల గురించి అధికారులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. విధి నిర్వహణలో అధికారులకు పోస్టల్ బ్యాలెట్ అందజేస్తారని, ఓటు వినియోగానికి వీలుగా ఇక్కడే ఫెలిటిటేషన్ కేంద్రాలు ఏర్పాటు చేసి, సీసీ కెమెరాలు అమర్చుతారన్నారు. మొదటి విడత శిక్షణలో 488 మంది పీవోలు, ఏపీవోలు శిక్షణ పొందినట్లు తెలిపారు. రెండో విడత శిక్షణ ఈనెల 6వ తేదీన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, స్వీప్ అధికారి రాజిరెడ్డి, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి జై చంద్రారెడ్డి, తహసీల్దార్లు శ్రీనివాస్, లక్ష్మణ్ బాబు, సురేశ్, రజని, మాస్టర్ ట్రైనర్స్ తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

నర్సాపూర్‌లో శిక్షణ తరగతులను పరిశీలిస్తున్న కలెక్టర్

నర్సాపూర్, ఏప్రిల్ 4: ఓటర్లు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాల్సిన బాధ్యత ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులపై ఉన్నదని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. గురువారం నర్సాపూర్ నియోజకవర్గ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో పీవో, ఏపీవోగా విధులు నిర్వహించే సిబ్బందికి నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ ప్రక్రియ నిర్వహణపై పీవో, ఏపీవోలు పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. భారత ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం మార్గదర్శకాలు పాటించాలన్నారు. పోలింగ్ ప్రక్రియలో ఈవీఎం, వీవీపాట్ల వినియోగం, సీల్ వేయుట, ప్రత్యేక ట్యాగ్, పోలింగ్ కేంద్రంలో వినియోగించే అన్ని రకాల స్టాట్యూటరీ, నాన్ స్టాట్యూటరీ ఫారాల గురించి క్షుణ్ణంగా తెలుసుకోవాలన్నారు. పోలింగ్ ప్రారంభించడానికి 90 నిమిషాల ముందు మాక్ పోలింగ్ నిర్వహించే విధానంపై వివరించాలన్నారు. మాక్ పోలింగ్‌లో 50కి తక్కువ కాకుండా ఓట్లు వేయాలని, వేసిన ఓట్లు వీవీ పాట్లలోని స్లిప్పులతో సరిచూసిన తదుపరి ఈవీఎం యంత్రాన్ని క్లియర్ చేసి అనంతరం నిర్దేశిత సమయంలోనే పోలింగ్ ప్రక్రియ ప్రారంభించాలని సూచించారు. కలెక్టర్‌తో ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్లు కమలాద్రి, శ్రీనివాస్, ఆంజనేయులు, గఫార్, మాస్టర్ ట్రైనర్స్ తదితరులు పాల్గొన్నారు.

గోడు వినే నాథుడు కరువు

మనోహరాబాద్ మండలం గౌతోజిగూడెంలో ఎండిపోయిన పాలాలను చూపుతున్న రైతు భాను

ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేసుకుంటున్న రైతన్నలు

- కాలిపోతున్న ట్రాన్స్‌ఫార్మర్లు
- అవస్థలు పడుతున్న రైతన్నలు
- పంటకు నీళ్లందక ఎండిపోతున్న పాలాలు
- సొంత ఖర్చులతో వారంలో మూడుసార్లు మరమ్మతులు

మనోహరాబాద్, ఏప్రిల్ 4: అస్తవ్యస్తంగా విద్యుత్ సరఫరాతో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయి. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడిపోతున్నారు. విద్యుత్ సరఫరా సరిగ్గా లేక, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతుండడంతో పంటలకు నీళ్లు అందక రైతన్నలు దిగాలు చెందుతున్నారు. మనోహరాబాద్ మండలం గౌతోజిగూడెంలో వారంలో మూడుసార్లు ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. ఈ విషయాన్ని విద్యుత్ అధికారులకు తెలిపినా, వారు పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. విద్యుత్ సరఫరా లేకపోవడంతో పొట్ట దశకు వచ్చిన పంటకు నీళ్లు అందడం లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వారంలో మూడుసార్లు సొంత ఖర్చుతో ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేయించుకుని, వాడుకుంటున్నామని రైతులు చెబుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు విద్యుత్ అధికారులు కనీసం సహకరించడం లేదని, ఫోన్ చేసినా స్పందించడం లేదని ఆరోపిస్తున్నారు.

జిల్లాలో 410 ధాన్యం కొనుగోలు కేంద్రాలు

- కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి
- సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

వెంకటేశ్వర్లు, అదనపు కలెక్టర్

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 4: ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా 410 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు మెదక్ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐకేపీ గ్రామ సంఘాల ద్వారా 108, సొసైటీల ద్వారా 279, డీసీఎంఎస్ ద్వారా 13, రైతు ఉత్పత్తి సంఘాల ద్వారా 10 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలోని ప్రతి రైతు పండించిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయడానికి కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని కేంద్రాల నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు. మరో రెండు రోజుల్లో జిల్లాలోని అన్ని కేంద్రాలు రైతులకు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. రైతులు ధాన్యాన్ని ప్రభుత్వ నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి కనీస మద్దతు ధర పొందాలని సూచించారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో ధాన్యం తూర్చారపట్టే యంత్రాలు సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. కేంద్రాల్లో తాగు నీరు, షామియానాతోపాటు అన్ని వసతులు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. రైతు ఎట్టి పరిస్థితుల్లోనూ దళారులు, మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దన్నారు. కేంద్రాల్లో సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్, టోల్ ఫ్రీ నంబర్ 9281103685 ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

రెడ్డిపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏపీఎం గౌరీశంకర్

నర్సాపూర్, ఏప్రిల్ 4: మండలంలోని రెడ్డిపల్లి, ఖాజీపేట్, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో ఏపీఎం గౌరీశంకర్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు విక్రయించాలన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ జల్లెడ పట్టిన ధాన్యాన్ని కేంద్రానికి తీసుకురావాలని సూచించారు. ధాన్యం అమ్మేటప్పుడు ఆధార్, బ్యాంకు అకౌంట్, పట్టా పాస్‌బుక్ తదితర పత్రాలు సమర్పిస్తే, సకాలంలో డబ్బులు ఖాతాలోకి వస్తాయన్నారు. అకాల వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున రైతులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సీసీ ప్రవీణ, రైతులు పాల్గొన్నారు.

సేవలే గుర్తింపునిస్తాయి: ఎంపీపీ

టీచర్ రాజశ్రీని సన్మానిస్తున్న ఎంపీపీ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 4: ప్రభుత్వ ఉద్యోగులు విధి నిర్వహణలో చేసిన సేవలే గుర్తింపునిస్తాయని ఎంపీపీ జంగం శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలంలోని చీలపల్లి గ్రామంలో ఉన్నత పాఠశాల టీచర్ రాజశ్రీ పదవీ విరమణ చేశారు. ఉపాధ్యాయురాలిగా ఆమె చేసిన సేవలు చిరస్థాయిగా ఉంటాయన్నారు. ఆమెకు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సత్యనారాయణ, ఎంపీటీసీ వీణా సుభాష్‌గౌడ్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు రామంద్రాచారి, బొడ్ల శ్రీనివాస్, కుమార్, వెంకటేశం, మారుతి, విజయ్‌కుమార్, అశోక్‌రెడ్డి ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం: డీఎస్పీ

విద్యార్థులకు సైబర్ అంబాసిడర్ సర్టిఫికెట్ అందజేస్తున్న డీఎస్పీ సుభాష్ చంద్రబోస్

మెదక్ రూరల్, ఏప్రిల్ 4: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యాశకు పోయి మోసపోవద్దని జిల్లా సైబర్ సేఫ్టీ వింగ్ డీఎస్పీ సుభాష్ చంద్రబోస్ అన్నారు. గురువారం మండలంలోని రాజ్‌పల్లి ఉన్నత పాఠశాలలో సైబర్ అంబాసిడర్ కార్యక్రమంలో డీఎస్పీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బలహీనతలను ఆసరా చేసుకుని సైబర్ నేరాలకు పాల్పడుతున్నారన్నారు. బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామని చెప్పి ఓటీపీ తెలుసుకుని ఖాతాలోని నగదు ఖాళీ చేస్తున్నారన్నారు. గుర్తు తెలియని నెంబర్ల నుంచి వచ్చే లింక్స్ ఓపెన్ చేయొద్దన్నారు. సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేయాలని, పోలీసులను ఆశ్రయించాలన్నారు. సైబర్ అంబాసిడర్ సర్టిఫికెట్స్‌ను నలుగురు విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు అశోక్, అవేత్ అలీ, ఉమాకాంత్, కృష్ణకాంత్, షీటీమ్ సభ్యులు ప్రమీల, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

రాములోరి ఉత్సవాల కరపత్రం ఆవిష్కరణ

ఉత్సవాల కర పత్రాలను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్, ఆలయ కమిటీ

రామాయంపేట, ఏప్రిల్ 4: రామాయంపేటలో ఈనెల 14 నుంచి 18 వరకు సీతారాముల కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నారు. గురువారం రామాలయంలో పురపాలిక చైర్మన్ జితేందర్‌గౌడ్ ఆలయ కమిటీ నేతృత్వంలో ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ దె చంద్రం, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సరాఫ్ యాదగిరి, గజవాడ నాగరాజు, పటేరి రవీందర్, నవాత్ ప్రభాకర్, పటేరి రాము, మహేశ్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దుర్గమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 4: పెద్దశంకరంపేట లో దుర్గమ్మ తల్లి విగ్రహ పునఃప్రతిష్ఠ ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. తొలి రోజు వేదబ్రాహ్మణుల మంత్రోశ్చరణల తో హోమం, గణపతి పూజ, పుణ్యాహవచ నం, అఖండ దీపారాధన, అభిషేకాలు నిర్వహించారు. ఎంపీపీ జంగం శ్రీనివాస్, ఎంపీటీసీ వీణా సుభాష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ ఆలయంలో హోమం చేస్తున్న ఎంపీపీ దంపతులు

వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే

వధూవరులను ఆశీర్వాదించిన మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

నిజాంపేట, ఏప్రిల్ 4: మండలంలోని నస్కల్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త సాకలి శ్రీనివాస్ కళావతి దంపతుల కూతురు కీర్తన వివాహం గురువారం జరిగింది. ఈ వివాహానికి మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఆమె వెంట చల్మెడ ఎంపీటీసీ బాల్‌రెడ్డి, రామాయంపేట పీఏసీఎస్ చైర్మన్ చంద్రం, కోఆప్షన్ సభ్యుడు గౌస్, నాయకులు దుబ్బ రాజాగౌడ్, వెంకట్, నగేశ్, రవి తదితరులు ఉన్నారు.

కౌన్సిలర్ కుటుంబానికి వంటేరు పరామర్శ



కౌన్సిలర్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

తూప్రాన్, ఏప్రిల్ 4: తూప్రాన్ మున్సిపాలిటీకి చెందిన 2వ వార్డు కౌన్సిలర్ మామిడి వెంకటేశ్ తండ్రి నారాయణ గురువారం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పట్టణంలోని కౌన్సిలర్ ఇంటికి చేరుకుని వారిని పరామర్శించారు. కౌన్సిలర్ కుటుంబానికి సానుభూతి తెలిపారు. ఆయన వెంట మాజీ ఎంపీటీసీ వెంకటేశ్, సీనియర్ నాయకులు ప్రభాకర్ రెడ్డి, ఆంజనేయులు ఉన్నారు.

నేడు బీఆర్ఎస్ సమావేశం

పాపన్నపేట, ఏప్రిల్ 4: మండలంలోని కొత్తపల్లి గ్రామంలో నేడు బీఆర్ఎస్ ఎన్నికల సమావేశం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు కుమ్మరి జగన్ తెలిపారు. కార్యక్రమానికి మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, పట్లోళ్ల శశిధర్‌రెడ్డి, పార్టీ ఎంపీ అభ్యర్థి వెంకట్‌రాంరెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, తిరుపతిరెడ్డి హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

ఏడుపాయల్లో నీట మునిగి వ్యక్తి మృతి

వెంకటేశ్ మృతదేహం

పాపన్నపేట, ఏప్రిల్ 4: వనదుర్గా మాత దర్శనానికి వచ్చి మంజీరా నది పాయల్లో ఒక వ్యక్తి నీట మునిగి మృతిచెందిన ఘటన పాపన్నపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఏడుపాలయలో గురువారం జరిగింది. ఎస్సై నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ జిల్లా బాలానగర్‌కు చెందిన వెంకటేశ్ (28) కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. గురువారం కుటుంబ సభ్యులతో కలిసి ఏడుపాయల వనదుర్గా మాత దర్శనానికి వచ్చారు. పుణ్యస్నానాలు ఆచరిద్దామని వెంకటేశ్ అమ్మవారి ఆలయం ఎదుట మంజీరా నది పాయల్లో దిగాడు. ప్రమాదవశాత్తు నీట మునిగి మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని వెంకటేశ్‌ను బయటకు తీశారు. అప్పటికే ఆయన మృతిచెందాడు. పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా దవాఖానకు తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

లారీ ఢీకొని ఆరు మేకలు మృతి

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 4: రోడ్డుపై వెళ్తున్న మేకల మందను అతివేగంగా లారీ ఢీకొట్టింది. దీంతో ఆరు మేకలు మృతి చెందిన ఘటన మండలంలోని కొర్విపల్లి శివారులో గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గజ్వేల్‌కు చెందిన శ్రీశైలం తన మేకల మందను తీసుకుని మెదక్ మండలం శమ్నాపూర్‌కు వెళ్తున్నాడు. ఈ క్రమంలో కొర్విపల్లి శివారు వద్దకు రాగానే చేగుంట నుంచి నాందేడ్‌కు వెళ్తున్న లారీ మేకల మందవైపుగా వేగంగా దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఆరు మేకలు మృతి చెందాయి. 8 మేకలకు తీవ్రగాయాలయ్యాయి. సుమారు రూ.1.80 లక్షల నష్టం వాటిల్లినట్లు శ్రీశైలం తెలిపాడు. పోలీసులకు ఫిర్యాదు అందలేదని ఎస్సై నారాయణ తెలిపారు.

నేడు మెదక్ జిల్లా కేంద్రంలో ఇఫ్తార్ విందు

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 4: జిల్లా కేంద్రంలోని క్రిస్టల్ గార్డెన్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసినట్లు మెదక్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హఫీజోద్దీన్, పార్టీ పట్టణ అధ్యక్షుడు గుడూరు ఆంజనేయులుగౌడ్ గురువారం వేర్వేరు ప్రకటనలో తెలిపారు. ఈ విందుకు మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు తదితరులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

వడియారంలో ఇఫ్తార్ విందు

చేగుంట, ఏప్రిల్ 4: మండలంలోని వడియారంలో మైనార్టీ నాయకుడు మహ్మద్ నదీం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయనతోపాటు ఎంపీపీ మాసుల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ భాస్కర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వడ్ల నవీన్‌కుమార్, నాయకులు ఉసా ముద్దీన్, సాబేర్, ఎజాస్, సమీర్, శ్రీకాంత్‌గౌడ్, నర్సింహులు, యాదిరెడ్డి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.